వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నర్సాపూర్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 13: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నర్సాపూర్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే ఫైర్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఫైర్‌మెన్ ఐలయ్య, ఫైర్‌మెన్ జానారెడ్డి, వెంకటేశ్, ఆపరేటర్ అనిల్, బీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, బాల్‌రెడ్డి, ప్రసాద్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా

నర్సాపూర్, ఏప్రిల్ 13: గుక్కెడు నీరు లేకుండా జనాలు అల్లాడుతుంటే ఇక్కడేమో అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నది. మండలంలోని మాడాపూర్ గ్రామం ఛత్రుతండాలో వాటర్ ట్యాంక్‌లో నీరు పూర్తిగా నిండి ఉదయం నుంచి సాయంత్రం వరకు నీరు వృథాగా పోతున్నాయి. వాటర్ ట్యాంక్ నిండిన తర్వాత నీటి సరఫరా నిలిపివేయడంలో నిర్లక్ష్యం చేయడంతో రోజంతా నీరు వృథాగా పోతున్నదని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని, నీరు రోజూ అలానే వృథాగా పోతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు పట్టించుకుని ట్యాంక్ నిండగానే నీటి సరఫరాను నిలిపివేయాలని కోరారు.

ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు

ఎములాడ రాజన్న సేవలో మాజీ ఎమ్మెల్సీ

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి కోడె మొక్కులు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు మాజీ ఎమ్మెల్సీ దంపతులను ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నర్సాపూర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ సభ్యులు

నర్సాపూర్, ఏప్రిల్ 13: టీఎస్‌యూటీఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని నర్సాపూర్‌లో ఆదివారం నర్సాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. టీఎస్‌యూటీఎఫ్ జెండాను ఎగరవేశారు. నర్సాపూర్ డివిజన్ స్థాయిలో ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులకు నిర్వహించిన వివిధ రకాల క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మారావు, శ్రీనివాస రావు, డివిజన్ నాయకులు రవి, గంగాధర్, నాగుల్‌మీరా, రమేశ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

పోచమ్మతల్లి బోనాల ఊరేగింపులో బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట, ఏప్రిల్ 13: చల్మెడలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ ఉత్సవాలను గంగపుత్ర సంఘం సభ్యులు ఆదివారం నిర్వహించారు. ఉత్సవాలకు బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కొండల్‌రెడ్డి, మున్సిపాల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, చింతల స్వామి, కిష్టాగౌడ్ ,నాయకులు లక్ష్మీ నర్సింహులు,రాజు,రంజిత్‌గౌడ్,మంగ్యానాయక్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిజాంపేట, ఏప్రిల్ 13: మండలంలోని కల్వకుంట ఉన్నత పాఠశాలలో 1999-2000 లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 25 ఏండ్ల తర్వాత ఒకే చోట తమకు విద్యా నేర్పించిన ఉపాధ్యాయులతో కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రారెడ్డి, టీచర్లు నర్సింగరావు, వెంకట్రాములు, శ్రీహరి, రాజశేఖర్, సతీశ్‌కుమార్, పూర్వ విద్యార్థులు దుబ్బారాజు, రవి, మహేందర్, నాగరాజు, పరుశరాములు, శ్రీనివాస్, అశోక్ ఉన్నారు.

మృత్యు కుహరాలు

- రోడ్డు పక్కనే ప్రమాదకరంగా బావులు
- దుమ్ము రేగుతున్న రోడ్లు
- నరకయాతన పడుతున్న వాహనదారులు
- ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు



దుబ్బాక: బావిలో కారు బోల్తా పడి మృత్యువాత పడిన వారిని బయటకు తీస్తున్న దృశ్యం (ఫైల్)

దుబ్బాక: దుబ్బాక-భూంపల్లి రోడ్డులో చౌదర్‌పల్లి సమీపంలో ఇరువైపులా ప్రమాదకరమైన బావి

వర్గల్: శేరిపల్లి బైపాస్ రోడ్డులో మూలమలుపు సమీపంలోనే ఏర్పడ్డ పెద్ద గొయ్యి

హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్ పందిళ్ల మధ్య దుమ్ముధూళిలో వాహనదారులు

దుబ్బాక, ఏప్రిల్ 13: రోడ్డు పక్కనే ఉన్న పాత బావులు ప్రయాణికుల పాలిటా మృత్యు కుహరాలుగా మారాయి. బావుల చుట్టూ ముళ్లపొదలు ఉండటంతో గుర్తు పట్టరాకుండా మారాయి. మరికొన్ని మూలమలుపుల వద్ద ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దుబ్బాక నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల పక్కన బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో సాగు నీటి కోసం తవ్విన పెద్ద బావులను అలాగే వదిలేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో సిద్దిపేట-రామయంపేట రహదారిలో చిట్టాపూర్ శివారులో అతి వేగంతో వచ్చిన ఓ కారు అదుపుతప్పి బావిలో పడి, ముగ్గురు మృతి చెందారు. ఇటీవల దుబ్బాక మండలం అప్పనపల్లిలో ఓ వాహనం రోడ్డు పక్కనే ఉన్నా పాత బావి లో పడి ఒకరు మృతి చెందారు. ప్రమాదం జరిగినప్పుడు అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారు.

బావులను పూడ్చి, ప్రమాదాలు అరికట్టాలి

చిట్టాపూర్ శివారులో అతి వేగంతో వచ్చిన ఓ కారు టైరు పేలి, అదుపు తప్పి పక్కనే ఉన్న బావిలో పడింది. ఈ ఘటనలో తల్లీ కుమారుడు మృతి చెందారు. బావిలో పడిన కారును తీసే ప్రయత్నంలో ఓ జాలరి కూడా మృతి చెందాడు. ఘటన జరిగి రెండేండ్లు గడుస్తున్నా, ఇప్పటికీ ఆ బావిని మాత్రం పూడ్చలేదు. దుబ్బాక-భూంపల్లి రోడ్డులో, దుబ్బాక-ధర్మాజీపేట, దుంపలపల్లి- చెల్లాపూర్, పెద్దగుండవెల్లి- దుంపపల్లి, రఘోత్తంపల్లి- శిలాజీనగర్, చీకోడు-అచ్చుమాయిపల్లి రోడ్ల పక్కన ప్రమాదకరంగా బావులున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి బావుల వద్ద కంచెలు, రక్షక చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మూలమలుపు.. ప్రమాదానికి పిలుపు

వర్గల్, ఏప్రిల్ 13: వర్గల్‌కు కూతవేటు దూరంలోని శేరిపల్లికి వెళ్లే బైపాస్ రోడ్డు మూలమలుపునకు సమీపం వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. వాహనాలు అదుపు తప్పితే పెద్ద ప్రమాదమే జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో శేరిపల్లి, వర్గల్ గ్రామాలకు బీటీ రోడ్డు వేశారు. నేడు గుంతలు పడినా పట్టించుకునేనాధుడు కరువయ్యాడు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు గొయ్యిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

వామ్మో.. ఆ రోడ్డుపై ప్రయాణమా?

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 13: జాతీయ రహదారి విస్తరణ పనులు వాహనదారులకు నరకయాతన చూపెడుతున్నాయి. వాహనదారులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాల్సిన సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇక్కట్లు తప్పడం లేదు. హుస్నాబాద్ నుంచి పందిల్లకు వెళ్లే మార్గమధ్యలో బ్రిడ్జి పనులు నిర్వహిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా పక్కనే మరో మట్టి రోడ్డు దాదాపు అర కిలో మీటర్ వరకు నిర్మించారు. దీంతో పెద్ద వాహనం వెళ్లితే చాలు ఆ దారిపై దుమ్ము, ధూళీ నిండిపోతున్నది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జి పనులు పూర్తి చేసే వరకు దుమ్ము, ధూళీ లేవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్లకు పారితోషికమేదీ?

- ఐదు నెలలుగా అందని ప్రోత్సాహకం
- వివరాల నమోదులో 860 ప్రైవేట్, 338 డాటా ఎంట్రీ ఆపరేటర్లు
- జిల్లాలో రూ.66.19 లక్షల పెండింగ్

మెదక్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్లు పారితోషికం కోసం ఎదురుచూస్తున్నారు. కులగణన పేరిట రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ మొదటి వారంలో ప్రారంభించి అదే నెలలో పూర్తి చేసింది. సిబ్బంది ఇంటింటా తిరిగి స్టిక్కర్లు అంటించి కుటుంబ వివరాలు సేకరించారు. సమగ్ర సర్వేలో కుటుంబాల వివరాల నమోదులో డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ప్రైవేట్ ఆపరేటర్లకు రూ.66.19 లక్షల పారితోషికం రావాల్సి ఉంది.

ఐదు నెలలుగా ఎదురుచూపులు

జిల్లాలోని 21 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టారు. ఇందులో 860 మంది ప్రైవేట్, 338 డేటా ఎంట్రీ ఆపరేటర్లు విధులు నిర్వహించారు. సర్వే పర్యవేక్షణ కోసం మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, కమిషనర్లు, ఇతర శాఖల అధికారులను పర్యవేక్షకులుగా, మండల ప్రత్యేకాధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించి ఈ సర్వే చేయించారు. గతేడాది నవంబర్ 9 నుంచి అదే నెల 22 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజూ 15 ఇండ్ల వరకు సర్వే చేశారు. ఆ వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. సర్వే ముగిసి ఐదు నెలలు కావాస్తున్నా ఇప్పటికీ వారికి పారితోషికం అందలేదు.

2,38,495 కుటుంబాల వివరాలు నమోదు

జిల్లా వ్యాప్తంగా 2,38,495 కుటుంబాల్లో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ ఆపరేటర్లు పూర్తి చేశారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో ఫారం నమోదు చేసినందుకు రూ.30 చొప్పున పారితోషికం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. డాటా ఎంట్రీ ఆపరేటర్ల బ్యాంకు ఖాతాల వివరాలు కూడా అధికారులకు సమర్పించారు. అయినా ఇప్పటి వరకు డబ్బులు జమ కాలేదని వారు వాపోతున్నారు.

ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్ల పారితోషకం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. జిల్లాలో 860 మంది ప్రైవేట్ ఆపరేటర్లు, 338 డేటా ఎంట్రీ ఆపరేటర్లు విధులు నిర్వహించారు. వీరికి సంబంధించి రూ.66.19 లక్షల పారితోషికం రావాల్సి ఉంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం ఇంకా నిధులు మంజూరు చేయలేదు.

- బద్రినాథ్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, మెదక్

ఫిట్స్‌తో కుంటలో పడి ఒకరు మృతి

శివ్వంపేట, ఏప్రిల్ 13: ఫిట్స్ వచ్చి కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన నీలం శేఖర్ (28) శివ్వంపేట మండలం కొత్తపేటలోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఈ నెల 12న సాయంత్రం వరుసకు బావ అయిన జగన్‌తో కలిసి రొయ్య నికుంటకు చేపలు పట్టడానికి వెళ్లారు. జగన్ కుంటలోకి దిగగా ఒడ్డున కూర్చున్న నీలం శేఖర్‌కు ఫిట్స్ రావడంతో కుంటలో పడి కొట్టుకుంటుండగా గమనించిన జగన్ వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి నీలం వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఎర్ర శ్యామల

శివ్వంపేట, ఏప్రిల్ 13: వివాహిత అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్లాపూర్‌కు చెందిన ఎర్ర శ్యామల (45) ఈ నెల 12న ఉదయం కూలి పనికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి, ఇంటికి తిరిగిరాలేదు. రాత్రి ఇంటికి వచ్చిన భర్త ఎర్ర సత్తయ్య తన భార్య ఇంటికి ఇంకా రాకపోవడంతో తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిజాంపేట, ఏప్రిల్ 13: నిజాంపేటలోని సబ్ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ నేత, పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, డైరెక్టర్లు దుర్గయ్య, శ్రీనివాస్ గౌడ్, రాజం, సీఈవో శోభారాణి, సిబ్బంది మహిపాల్, రమేశ్ రైతులు లక్ష్మణ్, కొమురయ్య, చిన్న అంజాగౌడ్, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సెలవు రోజూ ఆర్‌వీవీ దరఖాస్తుల స్వీకరణ

రామాయంపేట, ఏప్రిల్ 13: సెలవు రోజు కూడా రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో షాజులుద్దీన్ తెలిపారు. ఆర్‌వీవి దరఖాస్తులకు 14వ తేదీ సోమవారం చివరి రోజు వరకు తీసుకుంటామని పేర్కొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

వాల్ పోస్టర్లను అతికిస్తున్న బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ అంజనేయులు, పార్టీ శ్రేణులు

మెదక్‌లో వాల్ రైటింగ్ చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

- వరంగల్ సభకు గులాబీ సేన రెడీ
- జిల్లా కేంద్రంలో జోరుగా వాల్ రైటింగ్స్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 13: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. పెద్ద ఎత్తున తరలివెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా సభను విజయవంతం చేసేలా మెదక్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం వాల్ రైటింగ్స్ రాయించారు. పట్టణంలోని పలు కూడళ్లలో స్వయంగా వాల్ రైటింగ్ చేపట్టారు. వారు పోస్టర్లు స్వయంగా అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ సభకు గులాబీ సేన రెడీగా ఉందన్నారు.

ఏడుపాయల్లో భక్తుల సందడి

ధ్వజ స్తంభం వద్ద క్యూలైన్‌లో భక్తులు

పూజలు అందుకుంటున్న దుర్గామాత

పాపన్నపేట, ఏప్రిల్ 13: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తుల సందడి నెలకొన్నది. మూడు రోజులు సెలువులు రావడంతో భక్తులు భారీ సంఖ్యలో ఏడుపాయలకు వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులుదీరారు. వీరు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు, మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్, సిబ్బంది శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యామ్ రావు, బత్తిని నర్సింహులు, రాజు, వరుణాచారి తదితరులు ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థివశర్మ, రాముశర్మ, నాగరాజు శర్మ తదితరులు పూజలు చేశారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అల్లాదుర్గం, ఏప్రిల్ 13: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం అల్లాదుర్గంలోని బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ప్రపంచ మేధావిగా అన్ని దేశాల చట్టాలను అధ్యాయనం చేసి దేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన సామాజిక వేత్త అంబేద్కర్ అని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆలోచనా మార్గంలో మనమందరం నడవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో దక్షిణ భారత సమత సైనిక్ దళ్ అధ్యక్షుడు రెంజర్ల రాజేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింహులు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు అంజి యాదవ్, ప్రభు, ముప్పారం ప్రకాశ్, పుట్టి కిష్టయ్య, సుదర్శన్, పెంటయ్య, బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ

మట్టల పండుగలో పాల్గొన్న భక్తులు

మట్టల పండుగ పురస్కరించుకుని చర్చి చుట్టూ శిలువ, మట్టలతో ఊరేగిస్తున్న పాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 13: మెదక్ చర్చిలో చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండుగ ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలిరావడంతో చర్చి కిటకిటలాడింది. యేసు శిలువతో పాటు భక్తులు మట్టలతో భక్తి గీతాలు అలపిస్తూ ఊరేగించారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం ఈ పండుగ చేసుకుంటారు. సీఎస్ఐ మినిస్ట్రియల్ సెక్రెటరీ రెవరెండ్ జయానంద్ భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. ప్రత్యేక ప్రార్థనల్లో చర్చి పాస్టర్లు డేవిడ్, శ్రీనివాస్, జైపాల్, శ్రీనివాస్, సీఎస్ఐ కమిటీ సభ్యులు గంట సంపత్, జాన్సన్, శాంసన్‌సందీప్, జాన్సన్, సువన్ డగ్లస్ పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ జయంతి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 13: రాజ్యంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ 139జయంతిని స్థానిక అక్కన్నపేట చౌరస్తాలో సోమవారం నిర్వహించనున్నట్లు మహనీయుల ఉత్సవాల కమిటీ కన్వీనర్ లింగాల సాయన్న ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు సబ్బండ వర్గాలు అంబేద్కర్ జయంతికి హాజరుకావాలని మంత్రి కోరారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోయవద్దు: ఎస్సై

కొల్చారం, ఏప్రిల్ 13: మెయిన్ రోడ్డుపై ధాన్యం ఆరబోయవద్దని కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్ రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని పోతంశెట్టిపల్లి వద్ద మెదక్, హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు ధాన్యం ఆరబోశారు. దీంతో ఎస్సై వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే వాహనదారులు ప్రమాదాలకు గురవుతారని రైతులకు అవగాహన కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.